
సాక్షి కర్నూలు

గురువారం । 11 । మే । 2023



టీబీ డ్యామ్‌కు ఇన్‌ఫ్లో

హొళగుంద: అకాల వర్షాలతో తుంగభద్ర జలాశయానికి 1,455 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలో 2.938 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధనలో భాగంగా శ్రీశైలంలో అనంతపురానికి చెందిన అమృతకూచిపూడి నృత్య కళానిలయం కళాకారులు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: క్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ ఏ గ్రేడ్ వనరులు



సమీక్ష నిర్వహిస్తున్న కళాశాల విద్య ఆర్‌జేడీ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నాక్ ఏ గ్రేడ్ సాధించేందుకు అన్ని వనరులున్నాయని కళాశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) డాక్టర్ డి.నాగలింగారెడ్డి అన్నారు. బుధవారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. కళాశాలలో ప్రస్తుతం నిర్వహిస్తున్న కోర్సులపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

నెలాఖరులో వైఎస్‌ఆర్ రైతుభరోసా

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ రైతు భరోసా కింద వరుసగా 5వ ఏడాది పెట్టుబడిసాయం విడుదలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతు భరోసాతో 2022–23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా పరిహారం, ఇటీవల అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా విడుదల కానుంది. వ్యవసాయ శాఖ తాజా సమాచారం మేరకు ఈ నెల 25 లేదా 26 తేదీల్లో వైఎస్‌ఆర్ రైతుభరోసాతో పాటు మిగిలిన వాటిని విడుదల చేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

‘ఈ స్టాంపింగ్’ సులభతరం

కర్నూలు(సెంట్రల్): ఆస్తుల క్రయ, విక్రయాల కోసం నాన్ జ్యూడీషియల్ స్టాంపుల స్థానంలో ఈ–స్టాంపింగ్‌లను వాడాలని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పీజీఎస్ కల్యాణి బుధవారం ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. ఈస్టాంపింగ్‌ను వాడడం సులభతరంతోపాటు చట్టబద్ధమన్నారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ. 10, 20, 50, 100 ఈస్టాంపింగ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సహకారంతో ఈస్టాంపింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.


క్రమశిక్షణ చర్యలను పకడ్బందీగా నమోదు చేయండి



రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలను పకడ్బందీగా హెచ్‌ఈఆర్‌బీ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు తెలిపారు. ఇందుకు ఆర్థిక శాఖ షెడ్యూలు ఇచ్చిందని, ఆ ప్రకారం డీడీఓలు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ అన్ని శాఖల డీడీఓలు ఈ నెల11న డీసీడీబీలో ఉద్యోగులపై ఉన్న కేసుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఏసీబీ కేసులు, విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంటు కేసులు, డిపార్టుమెంటు కేసులు, ఇతరత్రా క్రిమినల్ కేసులు, గృహహింస తదితరాలన్నింటినీ ఇందులో చూపాలన్నారు. 12న డేటాను సబ్ ట్రెజరీ అధికారులు, సహాయ ట్రెజరీ అధికారులు, జిల్లా ట్రెజరీ అధికారులు పరిశీలిస్తారని(స్క్రూటినీ) తెలిపారు. అనంతరం ఈ డేటాను హెచ్‌ఇఆర్‌బీ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేస్తారన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



కర్నూలులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం బుధవారం పాలిసెట్‌ను ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. కర్నూలులో 13 కేంద్రాలను ఏర్పాటు చేయగా 4,382 మందికిగాను 3,954 మంది, ఆదోనిలో 7 కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,891 మందికిగాను 2,620 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సారా కేసుల్లో నిందితునిపై పీడీ యాక్ట్

గుత్తి: తుగ్గలి మండలం మిద్దె తండాకు చెందిన పాములా నాయక్‌పై అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు గుత్తి సెబ్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. పాములా నాయక్ నాలుగు సారా కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పోలీసులు పలు సార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోలేదు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నిందితుడిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

దాహం తీరింది!

➢ ప్యాపిలి మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో ప్రతి వేసవి కాలం సీతమ్మ తండా, అలేబాదు తండా, వెంగళాంపల్లి, మునిమడుగు, డి.రంగాపురం, ప్యాపిలిలో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తేది. ట్యాంకర్లతో ప్రజలకు నీటిని సరఫరా చేసే వారు. అయితే నాలుగేళ్ల నుంచి ఈ కష్టాలు తీరాయి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భజలాలు పెరిగి ట్యాంకర్ల అవసరం రావడం లేదు.

➢ హొళగుంద మండలంలో ప్రతి వేసవిలో ఎల్లార్తి, గజ్జహళ్లి మంచి నీటి పథకాలు ఎండిపోయేవి. ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. నాలుగేళ్ల నుంచి సమృద్ధిగా వర్షాలు కురవడం, తుంగభద్ర దిగువకాలువకు రబీ సీజన్‌లో సైతం నీరు రావడంతో నీటి కష్టాలు గట్టెక్కాయి. ట్యాంకర్ల అవసరం లేకుండా ఈ పథకాల కింద 12 గ్రామాల ప్రజల దాహార్తి తీరుతోంది.

.. పై రెండు మండలాలే కాదు ఉమ్మడి కర్నూలు జిల్లాలో మంచినీటి సమస్య 98 శాతం తొలగిపోయింది. వరుణుడి కరుణ, రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ప్రజలు వేసవిలో నీటి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా పోయింది.



- సమృద్ధిగా కురిసిన వర్షాలతో పెరిగిన భూగర్భ జలాలు
- ఏప్రిల్, మే నెలల్లో కురిసిన వర్షాలతో రీచార్జ్ అయిన బోర్లు
- గతంలో ఉమ్మడి జిల్లాలో 200లకు పైగా గ్రామాల్లో నీటి ఎద్దడి
- ప్రస్తుతం రెండు గ్రామాల్లోనే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



చింతకుంట రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

కర్నూలు(అర్బన్): వేసవిలో ప్ర‘జల’ కష్టాలు తొలగాయి. భారీ వర్షాలతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో మే నెల ప్రారంభమైనా మెజారిటీ ప్రాంతాల్లోని నీటి వనరులు కళకళలాడుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు ముందస్తుగా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. నాలుగేళ్ల క్రితం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు అంతంత మాత్రంగా కురిసేవి. వేసవి వచ్చిందంటే దాదాపు 200కు పైగా గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తేది. అనేక గ్రామాల ప్రజలు కిలోమీటర్లు ప్రయాణించి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేది. అయితే 2019 నుంచి వర్షాలకు విరివిగా కురిసి వివిధ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, కాలువల్లో నీరు పుష్కలంగానే ఉంది. అయినా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ ఏడాది వేసవిలో జిల్లాలో 107 గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు అంచనాకు వచ్చారు. వీటికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు రూ.8.08 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. అయితే ఏప్రిల్ ఆఖరి వారంలో, అలాగే మే నెలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఆయా ప్రాంతాల్లోని బోర్లు తిరిగి రీచార్జ్ అయ్యాయి. ప్రస్తుతం ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె, తిప్పాయిపల్లె గ్రామాలకు మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.

జెడ్పీ నుంచి రూ.2.65 కోట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రస్తుత వేసవిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు జిల్లా పరిషత్ నుంచి రూ.2.65 కోట్లు కేటాయించారు. ఒక్కో జెడ్పీటీసీ సభ్యుడికి రూ.5 లక్షల ప్రకారం నిధులను అందించేందుకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆయా జెడ్పీటీసీ సభ్యుల నుంచి వచ్చిన ప్రతిపాదనలను ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజినీరుకు పంపి ఆయా పనులను చేపట్టేందుకు కార్యాచరణను రూపొందించారు.

తాజాగా రూ.40.10 కోట్లతో టెండర్లు

జిల్లాలోని 32 సమగ్ర రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణకు సంబంధించి తాజాగా రూ.40.10 కోట్లతో టెండర్లను ఆహ్వానించారు. ఇందులో ఆదోని డివిజన్‌లో మొత్తం 25 మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటిలో 23 పథకాలకు జిల్లా స్థాయిలో టెండర్లు దాఖలు కాగా, ఒక్క పథకానికి మాత్రం చీఫ్ ఇంజినీరు స్థాయిలో టెండర్లు జరగనున్నాయి. అలాగే కర్నూలు డివిజన్‌లోని 7 మంచి నీటి పథకాల నిర్వహణకు సంబంధించిన టెండర్లు సీఈ స్థాయిలో జరగనున్నాయి.

ఆశాజనకంగా భూగర్భ జలాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. గత డిసెంబర్ నెలలో జిల్లా మొత్తం సగటున 5.42 మీటర్లలో భూగర్భజలాలు లభించడం విశేషం. జనవరిలో కర్నూలు జిల్లాలోని ఐదు మండలాల్లో 3 మీటర్లు, 15 మండలాల్లో 3 నుంచి 8 మీటర్లు, ఐదు మండలాల్లో 8 నుంచి 20 మీటర్లలో లభ్యమయ్యాయి. గతంలో గోనెగండ్ల 3, కోసిగి 9, ఓర్వకల్లు 1, వెల్దుర్తి మండలంలో 1 చొప్పున మొత్తం 14 గ్రామాల్లో భూగర్భజలాలను 100 శాతం వినియోగించేవారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగి, వినియోగం తగ్గింది. దీంతో ఆయా గ్రామాల్లో బోర్లపై నిషేధాన్ని తొలగించారు.

తాగునీటి అవసరాలకు అధిక ప్రాధాన్యత



జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి అవసరాలు తీర్చేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాం. ఇప్పటికే పలు పర్యాయాలు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో సమీక్షలు నిర్వహించి నీటి ఎద్దడి తలెత్తే గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించాం. కేవలం తాగునీటి అవసరాలు తీర్చే పనులు చేపట్టేందుకు ఒక్కో జెడ్పీటీసీ సభ్యుడికి రూ.5 లక్షలు విలువ చేసే పనులు చేపట్టేందుకు జెడ్పీ నుంచి రూ.2.65 కోట్లు మంజూరు చేయనున్నాం. యుద్ధ ప్రాతిపదికన ఆయా పనులు చేపట్టాలని సంబంధిత ఇంజినీర్లకు ఆదేశాలు ఇచ్చాం.

– ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ చైర్మన్

కర్నూలు జిల్లాలో నీటి పథకాల వివరాలు..

- జిల్లాలో గ్రామ పంచాయతీలు : 484
- మొత్తం గ్రామాలు : 721
- గ్రామీణ జనాభా : 16,28,736
- రోజుకు ఒక వ్యక్తికి అందిస్తున్న రక్షిత మంచినీరు : 55 లీటర్లు
- జిల్లాలోని నీటి వనరులు : తుంగభద్ర దిగువ కాలువ, జీడీపీ, కేసీ కెనాల్, హంద్రీ నీవా కాలువ
- సీపీడబ్ల్యూఎస్‌లు : 32
- పీడబ్ల్యూఎస్‌లు : 371
- ఎంపీడబ్ల్యూఎస్‌లు : 445
- డైరెక్ట్ పంపింగ్ : 97

2022 జూన్ నుంచి నమోదైన వర్షపాతం వివరాలు

నెల	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం (ఎంఎంలలో)
జూన్	77.7	77.1
జూలై	90.7	126.7
ఆగస్టు	116.2	127.4
సెప్టెంబర్	116.5	127.3
అక్టోబర్	110.2	155.2
నవంబర్	29.2	4.2

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాం. భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్న దృష్ట్యా ఇప్పటి వరకు ఎక్కడా నీటి సమస్య తలెత్తలేదు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రస్తుత వేసవిలో అవసరమైన ప్రాంతాల్లోని ప్రజల నీటి ఇబ్బందులను తీర్చేందుకు రూ.8.08 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే క్రాష్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేతి పంపులను రిపేర్లు చేశాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది 32 మంచినీటి పథకాల నిర్వహణకు టెండర్లను కూడా ఆహ్వానించాం.

– బీ నాగేశ్వరరావు, ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

చేనేతల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- నేత కార్మికులకు ఆధునిక పరికరాల పంపిణీ
- కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



పరికరాన్ని అందుకున్న చేనేత కార్మికులతో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోని అర్బన్: చేనేత కార్మికుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక హనుమాన్‌నగర్‌లో ఉన్న నీలకంఠేశ్వర ధ్యాన మందిరంలో బుధవారం చేనేత కార్మికులకు ఆధునిక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 120 మందికి రూ.1.30 కోట్లు విలువ చేసే పరికరాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. అంతేకాకుండా నేత కార్మికులకు వృత్తిలో శిక్షణ కూడా ఇస్తోందన్నారు. పరికరాల కోసం కేవలం 10 శాతం చెల్లిస్తే చాలని 90 శాతం సబ్సిడీ వస్తోందన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. నేతన్న నేస్తం కింద రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన చేనేత కుటుంబాలకు రూ.24 వేలు చొప్పున అందజేస్తోందన్నారు. అలాగే చేనేత పింఛన్ ఇస్తూ వారికి అండగా నిలిచిందన్నారు. వైఎస్సార్ హయాంలో చేనేతలకు గుర్తింపు కార్డులను అందించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీని జిల్లా కలెక్టర్ సృజన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను, వివరాలను ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ‘దిశ’ నిఘా

- పోలీసు స్టేషన్ల వార్షిక తనిఖీల్లో డీఐజీ



డీఎస్పీతో మాట్లాడుతున్న డీఐజీ సెంథిల్ కుమార్

కర్నూలు: సమస్యాత్మక ప్రాంతాల్లో దిశ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని కర్నూలు రేంజ్ డిఐజీ సెంథిల్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన ఎస్పీ క్రిష్ణకాంత్‌తో కలిసి కర్నూలు దిశ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులతో మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఫోక్సో కేసులు ఏ ప్రాంతాల్లో నమోదవుతున్నాయో విశ్లేషించి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ లక్ష్మయ్య, ఎస్‌ఐలు కేశవయ్య, సోనక్క సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పోలీసు స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు

నూతన పోలీసు స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మూడో పట్టణ సీఐ తబ్రేజ్‌కు డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశించారు. ఎస్పీ క్రిష్ణకాంత్‌తో కలిసి మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌ను డీఐజీ తనిఖీ చేశారు. మహిళా పోలీసులతో మాట్లాడి పని తీరును సమీక్షించడంతో పాటు పలు సూచనలు చేశారు.

బాడీఓన్ కెమెరాలు ఏర్పాటు చేయండి

పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమైన ట్రాఫిక్ జంక్షన్లలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌తో పాటు బాడీఓన్ కెరాలు ఏర్పాటు చేయించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం డిఐజీ సూచించారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించారు.

ఆర్‌యూలో 10 మందిపై సస్పెన్షన్ వేటు

- నకిలీ విద్యార్హతతో ఉద్యోగాలు పొందినట్లు నిర్ధారణ



రాయలసీమ యూనివర్సిటీ ముఖద్వారం

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీలో పది మంది నాన్ టీచింగ్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు తేలడంతో వీరిపై చర్యలు తీసుకున్నట్లు ఈ నెల 8వ తేదీన వర్సిటీ రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు. వర్సిటీ ఏర్పాటుకు ముందు ఎస్‌కే పీజీ సెంటర్‌గా ఉన్న సమయంలో హాస్టల్‌లో ఫ్రీఫుడ్ వర్కర్స్(రోజుకు మూడు పూటల భోజనం, వారికి నెలకు కేవలం రూ.50–100, సబ్బు మాత్రమే ఇచ్చేవారు)గా సుమారుగా 15 మంది ఉండేవారు. అలాగే నామినల్ మస్టర్ రోల్(డైలీ వైజ్ ఎంప్లాయ్)కింద మరికొంత మంది పని చేసే వారు. వీరికి రోజుకు సుమారుగా రూ.50 ఇచ్చేవారు. వర్సిటీ (2008లో) ఏర్పాటు అయ్యాక రోజుకు రూ.100 నుంచి 150 వరకు వేతనం ఇచ్చే వారు. అయితే 2011లో ఫ్రీ ఫుడ్ వర్కర్లుగా పని చేసే వారు అప్పటి ప్రభుత్వానికి విన్నవించుకోవడంతో జీఓ ఎం.ఎస్ నంబరు 3 ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్పు చేశారు. ఈ సమయంలో కొందరు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను చూపి మినిమం టైం స్కేలు అమలు చేయించుకున్నారు. అయితే తప్పుడు విద్యార్హత పత్రాలతో మినిమం టైం స్కేలు పొందుతున్నారని కొందరు విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై గత ఏడాది సెప్టెంబర్‌లో వర్సిటీ రిజిస్ట్రార్.. నాన్ టీచింగ్ ఉద్యోగుల విద్యార్హతల ధ్రువీకరణపై జిల్లా విద్యాశాఖ అధికారికి లేఖ రాశారు. కర్నూలు డిప్యూటీ డీఈఓ విచారణలో అక్రమాలు బయట పడ్డాయి. ఒక వ్యక్తి కర్నూలు నగరంలోని స్కూల్‌లో చదవకపోయినా చదివినట్లు టీసీలు సృష్టించారని నిర్ధారణ అయ్యింది. అలాగే మరో వ్యక్తి పాఠశాల లేకున్నా సర్టిఫికెట్ పొందారు. ఇంకొకరు టీసీ ట్యాంపర్డ్ చేశారు. 1983–87 మధ్యలో ఐదో తరగతి చదవకపోయినా చదివినట్లు మరొకరు ధ్రువీకరణ పత్రం సమర్పించి ఉద్యోగం పొందారు. 1973–77లో 1నుంచి 5వ తరగతి వరకు చదివినట్లు ఇచ్చిన సర్టిఫికెట్ నకిలీ అని కల్లూరు ఎంఈఓ నిర్ధారించారు. ఓ మహిళా ఉద్యోగి 1997–98లోనే 7,8 తరగతులు చదివినట్లు ఇచ్చిన టీసీ సైతం నకిలీదేనని తేలింది.

సస్పెండ్ అయిన వారు వీరే..

నకిలీ విద్యార్హత ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన 10 మందిపై వేటు వేయాలని ఈ నెల 4న నిర్వహించిన ఆర్‌యూ పాలక మండలి సమావేశంలో తీర్మానం చేశారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ నిర్ణయం తీసుకున్నారు. సస్పెండ్ అయిన వారిలో జె.నాగరాజ్, బి.శంకరయ్య, షేక్ మైమున్నీసా, బి.బాబు, పి.కృష్ణవేణి, కె.సుంకులమ్మ, బి.దాసమ్మ, ఎ.రవి, జి.మణెమ్మ, బి.లక్ష్మీదేవి ఉన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) బీటెక్ నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్ (ఆర్–19), సప్లిమెంటరీ (ఆర్–15) పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ పరీక్షలకు 14,508 మంది విద్యార్థులు హాజరుకాగా.. 13,317 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్ష ఫలితాలకు సంబంధించి రీకౌంటింగ్ ఫొటో కాపీ, చాలెంజ్ వాల్యూయేషన్ నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని, గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని వైస్ చాన్సలర్ సూచించారు. అలాగే ఈ నెల 25 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఈ సందర్భంగా విడుదల చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్–40, టర్నర్–20, మెకానిక్ మోటర్ వెహికల్–24, ఎలక్ట్రీషియన్ –20, మెకానికల్ డీజిల్–24, వెల్డర్–40, సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు జూన్ 6 వ తేదీలోగా iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డోన్ ఐటీఐ కాలేజీలో జూన్ 13న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9705683537, 9440748448 నంబర్లను సంప్రదించాలన్నారు.

మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- మంత్రాలయంలో 42.19 డిగ్రీల గరిష్టం నమోదు
- కర్నూలులో గరిష్టం 39.6, కనిష్టంగా 27.4 డిగ్రీలు



కర్నూలు(అగ్రికల్చర్): ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. నిన్న, మొన్నటి వరకు అకాల వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఉష్ణోగ్రతలు చాల వరకు తగ్గుముఖం పట్టాయి. తిరిగి వాతావరణం పొడిగా ఉండటంతో ఎండలు, వడగాలుల తీవ్రత పెరిగింది. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో మంత్రాలయంలో 42.19 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కర్నూలులో గరిష్ఠంగా 39.6, కనిష్ఠంగా 27.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడ పెరుగుతుండటం గమనార్హం. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

క్లుప్తంగా

ట్రాక్టర్ ట్రాలీల దొంగ అరెస్ట్

తుగ్గలి: ట్రాక్టర్ ట్రాలీల చోరీలకు పాల్పడుతున్న దొంగను తుగ్గలి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. వారం రోజుల వ్యవధిలో ఎద్దులదొడ్డి, మద్దికెరలో రెండు ట్రాక్టర్ ట్రాలీలు చోరీకి గురయ్యాయి. ఎద్దులదొడ్డిలో చోరీకి గురైన ట్రాలీకి సంబంధించి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. పత్తికొండ మండలం హోసూరుకు చెందిన చాకలి బొజ్జన్న, చాకలి రవీంద్ర కలిసి ట్రాలీలు చోరీ చేసినట్లు విచారణలో వెలుగుచూసింది. ఈ మేరకు బుధవారం తుగ్గలి సమీపంలో సంచరిస్తున్న రవీంద్ర పోలీసులను చూసి పారిపోగా బొజ్జన్నను పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణం వైఎస్సార్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ షిండే చంద్రకుమార్ అలియాస్ మరాఠి చంద్రపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుడి అమాయకులను డబ్బు కోసం హత్య చేయడం, గంజాయి విక్రయం, దొంగతనాలు, దారి దోపిడీలు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు నంద్యాల,కర్నూలు,వైఎస్సార్ కడప జిల్లాల్లో 21 కేసులు ఉన్నట్లు వెల్లడించారు. పలుమార్లు రిమాండ్‌కు తరలించినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశాల ప్రకారం పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

పోలీసుల అదుపులో డీజిల్ దొంగ

డోన్ టౌన్: హైవేలో ఆగి ఉన్న లారీల నుంచి డీజిల్ చోరీ చేసే దొంగను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నారాయణపేట్ జిల్లా మార్కెల్ మండలం కన్నూర్‌తండా గ్రామానికి చెందిన పాండునాయక్‌తో పాటు మరో ఇద్దరు డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. డోన్ మండలంలోని దేవరబండ గ్రామ సమీపంలో రాత్రి దొంగతనం చేస్తుండగా హైవే పోలీసులు గమనించి వెంబడించారు. పాండునాయక్ దొరకగా మిగతా ఇద్దరు పారిపోయినట్లు చెప్పారు. నిందితులు ఉపయోగించిన కారుతో పాటు పది డీజిల్ క్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం చేసిన డీజిల్‌ను దేవరబండ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో నిందితుడు అంగీకరించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కౌలు రైతుకు సర్కారు భరోసా

- అర్హత కలిగిన వారందరికీ పంట సాగు హక్కు పత్రం
- ఈ నెల 8 నుంచి ఆర్‌బీకేల వారీగా గ్రామసభలు
- అందనున్న అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలు
- పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేయనున్న బ్యాంకులు


సీసీఆర్ కార్డు


సీసీఆర్ కార్డుల జారీకి గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కౌలు రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రైతులతో సమానంగా అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలు పొందే విధంగా కౌలు రైతులకు క్రాప్ కల్టివేటర్ రైట్ (సీసీఆర్) కార్డులను జారీ చేస్తోంది. ఈ ఏడాది (2023-24) 11 నెలల కాలపరిమితితో ఈ కార్డులు జారీ చేయనున్నారు. ఇందుకోసం వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు రైతు భరోసా కేంద్రాల వారీగా ఈ నెల 8 నుంచి సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభలు ఈ నెల 20 వరకు జరగనున్నాయి. గ్రామసభల్లోనే సీసీఆర్ కార్డులతో కలిగే ఉపయోగాలపై కౌలు రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక చట్టం..

టీడీపీ హయాంలో రుణ అర్హత కార్డులు పంపిణీ చేసినప్పటికీ కౌలుదారులకు అవి ఉపయోగపడలేదు. ఈ కార్డులపై కనీసం బ్యాంకు రుణాలు కూడా తీసుకునేవారు కాదు. ఇతరత్రా ఎటువంటి ప్రయోజనాలు లభించేవి కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరాత్వ కౌలుదారుల అభ్యున్నతే లక్ష్యంగా క్రాప్ కల్టివేటర్స్ రైట్స్ యాక్ట్ -2019 పేరుతో ప్రత్యేక చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం కింద భూమి యజమానికి ఎటువంటి నష్టం జరగకుండా.. సాగుదారుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. గ్రామ సభల ద్వారా కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు(సీసీఆర్‌సీ) జారీ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 20,205 కార్డులు

ఉమ్మడి జిల్లాలో 2023-24 సంవత్సరానికి సంబంధించి 20,205 సీసీఆర్ కార్డులు జారీ చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. భూమి లేని కౌలు దారులు, దేవాదాయ భూములను సాగు చేసుకుంటున్న చిన్న, సన్నకారు రైతులందరు అర్హులే. కర్నూలు జిల్లాలో 7,315, నంద్యాల జిల్లాలో 12,890 ప్రకారం సీసీఆర్‌సీలు ఇవ్వాలనేది లక్ష్యం. ఈ లక్ష్యం మేరకు గ్రామసభలు జరుగుతున్నాయి. కార్డులు పొందిన వారికి 11 నెలల కాలంలో కేవలం పంటపైనే హక్కు ఉంటుంది. ప్రభుత్వ ప్రయోజనాలు, బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి ఇవి చక్కగా ఉపయోగపడతాయి. సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే సీసీఆర్ కార్డులు పొందిన కౌలు రైతులు సాగు చేసిన పంటలను విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది.

ప్రయోజనాలు ఇవే..

సాగుదారు హక్కు పత్రం పొందిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతుభరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం అందుతోంది. 2022-23లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12,672 మంది కౌలు రైతులకు పెట్టుబడి సాయం లభించడం విశేషం. కౌలుదారులకు పెట్టుబడి సాయాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. అధిక వర్షాలతో పంటలు 33 శాతం కంటే ఎక్కువగా దెబ్బతిన్నపుడు సీసీఆర్ కార్డులు పొందిన వారికి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ లభిస్తుంది. రైతులతో సమానంగా ఉచిత పంటల బీమా సదుపాయం పొందవచ్చు. సాగుదారులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను గడువులోపు చెల్లిస్తే వైఎస్ఆర్ సున్నా వడ్డీకి అర్హత లభిస్తుంది. మార్కెట్‌లో పండించిన పంటలకు ధరలు పడిపోయినపుడు సీసీఆర్ కార్డులు ఉన్న రైతులు మద్దతు ధరతో పంటలను అమ్ముకోవచ్చు. వ్యవసాయ శాఖ రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు పొందవచ్చు. 2022-23లో సీసీఆర్ కార్డులు పొందిన కౌలు రైతులకు జిల్లా సహకార కేంద్రబ్యాంకు పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేసింది.

పెట్టుబడి సాయం అందింది



మాకు ఎటువంటి భూమి లేదు. గతేడాది 2 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని భూయజమాని సహకారంతో సాగుదారు హక్కు పత్రం పొందాను. పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్నాను. కౌలు కార్డు ఉండంతో మాకు వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఒకసారి రూ.11500, మరో సారి రూ.2000 ప్రకారం మొత్తం రూ.13,500 పెట్టుబడి సాయం అందింది.

– నాగమద్దయ్య రామళ్లకోట, వెల్దుర్తి మండలం

రూ.80 వేలు రుణం తీసుకున్నా



కొన్నేళ్లుగా మేం రైతుల భూములను కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాం. గతేడాది పంటసాగు హక్కుపత్రం పొందాం. పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార పర పతి సంఘం(పీఏసీఎస్) నుంచి రూ.80 వేలు పంట రుణం తీసుకున్నాం. కార్డుపై రుణం దక్కడం ఎంతో ఊరటనిచ్చింది. కౌలుకు తీసుకున్న భూమిలో మొక్కజొన్న సాగు చేసి మంచి దిగుబడులు సాధించాం.

– వి.పెద్దపులేంద్ర, పసుపల, కర్నూలు మండలం

అర్హులందరికీ సీసీఆర్ కార్డులు

అర్హత కలిగిన కౌలు రైతులందరికీ క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డులు జారీ చేస్తాం. ఈ ఏడాది కార్డుల జారీకి ఆర్‌బీకేల వారీగా గ్రామ సభలు జరుగుతున్నాయి. కౌలు రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈ ఏడాది కర్నూలు జిల్లాలో 7,315 కార్డులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ లక్ష్యాన్ని ఇచ్చింది.ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. పట్టాదారులు ప్రభుత్వ పరంగా ఏఏ ప్రయోజనాలు పొందుతున్నారో... సీసీఆర్‌కార్డులు పొందిన వారికి కూడా అన్ని ప్రయోజనాలు ఉంటాయి.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

వలంటీర్ బలవన్మరణం


ఆఫ్రీన్ (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని జక్కసానికుంట్ల గ్రామానికి చెందిన వలంటీర్ ఆఫ్రీన్ (22) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తుగ్గలి మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన ఈమెకు జక్కసానికుంట్ల గ్రామానికి చెందిన నబీరసూల్‌తో 2018లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ గ్రామంలో అందరికి తలలోనాల్కగా మెలిగే ఆఫ్రీన్ ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. జలదుర్గం ఎస్ఐ నరేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

కర్నూలు(అర్బన్): స్థానిక అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోని ఎన్ గిరిప్రసాద్ నగర్‌లో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్లు కుమార్తె, బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఉరసారి పూజిత (20) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కడుపు నొప్పి భరించలేక తన కూతురు ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుందని తండ్రి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగ చిరంజీవి తెలిపారు.

అత్త, బావమరిదిపై కేసు

కర్నూలు(అర్బన్): తన భార్య కడుపులో బిడ్డ మృతికి తన అత్త, బావమరిది కారణమని ఆళ్లగడ్డకు చెందిన శ్రీనివాసులు కర్నూలు నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన తన భార్య శశిరేఖను కాన్పు నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలోనే ... కడుపులోనే శిశువు మృతి చెందడానికి అత్త ప్రభావతి, బావమరిది చంద్రాచారి కారణమని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి


మృతి చెందిన నారాయణరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట సమీపంలో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పెట్నికోటకు చెందిన నారాయణరెడ్డి(46) కొండమీదపల్లె సమీపంలో నుంచి ట్రాక్టర్‌లో మట్టిని తీసుకొచ్చేందుకు బయలు దేరాడు. గ్రామ సమీపంలోని చిన్న కనుమ దాటగానే ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎగిరి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు గురించి ఆరాతీశారు. కొలిమిగుండ్ల పీహెచ్‌సీలో ఉన్న నారాయణరెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఓర్వకల్లు: పండ్లతోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందని డ్వామా పీడీ, ఓర్వకల్లు మండల ప్రత్యేక అధికారి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా బుధవారం మండలంలోని హుసేనాపురం, పాలకొలను, చింతలపల్లె గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. పాలకొలను,కొమరోలు గ్రామాలకు చెందిన రైతులు మహబూబ్ సాహెబ్, నరసింహారెడ్డి సాగు చేసిన చీని తోటలను పరిశీలించారు. అక్కడి నుంచి కొమరోలు సచివాలయాన్ని సందర్శించి అందజేస్తున్న సేవలపై ఆరాతీశారు. తర్వాత ఓర్వకల్లు ఉపాధి కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక స్థాయి సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. పండ్ల తోటలపెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి పథకం ద్వారా సబ్సిడీలో పండ్ల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు పెంపకానికి సాయం అందజేస్తామన్నారు. ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు.అలాగే చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని ఆదేశించారు.గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని చెప్పారు. అనంతరం స్థానిక సీఎల్ఆర్‌సీలో బనవాసికి చెందిన కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్,పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సర్పంచ్ రామచంద్రుడు, ఈసీ మధు వెంకటకృష్ణ, సాంకేతిక సహాయకులు శ్రీకాంత్, రత్నమ్మ, చాంద్‌బాషా, క్షేత్రస్థాయి సహాయకులు రమేష్, మహేష్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం


మృతి చెందిన పెద్ద బిజ్జన(ఫైల్), తీవ్ర గాయాలపాలైన కళావతి, వాసు

బేతంచెర్ల: మండలంలోని కొలుములపల్లె గ్రామ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొలుములపల్లె గ్రామానికి చెందిన పెద్ద బిజ్జన (60)గ్రామ సమీపంలోని బొల్డాల కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం విధులకు ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. కొలుములపల్లె గ్రామానికి చెందిన వాసు, కళావతి బేతంచెర్ల నుంచి వస్తున్నారు. గ్రామ సమీపంలో వారి వాహనాలు ఎదురెదురై ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్ద బిజ్జనకు, కళావతి, వాసుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆటోలో బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించగా పెద్ద బిజ్జన (60) కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సాలమ్మ ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదంపై కేస నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

25 నుంచి సబ్సిడీ విత్తనాల పంపిణీ


విత్తన వేరుశనగ కాయలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించ ఈ నెల 25వ తేదీ నుంచి సబ్సిడీ విత్తనాల పంపిణీకి వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఇప్పటి వరకు వేరుశనగ, దయంచ, పిల్లిపెసర విత్తనాల ధరలు ఖరారయ్యాయి. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీపై పంపిణీ చేసేందుకు వేరుశనగ కే-6 రకం 15,905 క్వింటాళ్లు కేటాయించింది. గత ఏడాది పంపిణీ చేసిన వేరుశనగను దృష్టిలో పెట్టుకొని వేరుశనగ కేటాయించినట్లు స్పష్టమవుతోంది.

- కే-6 వేరుశనగ కిలో పూర్తి ధర రూ.93. ఇందులో సబ్సిడీ 40 శాతం ఉంటుంది. కిలోకు సబ్సిడీ రూ.37.20లుగా నిర్ణయించారు. రైతులు కిలో వేరుశనగకు రూ.55.80 ప్రకారం చెల్లించాలి.
- పచ్చిరొట్ట ఎరువులైన దయంచ, పిల్లి పెసర విత్తనాల ధరలు కూడా ఖరారయ్యాయి. 50 శాతం సబ్సిడీ ఉంటుంది. దయంచ కిలో విత్తనాల పూర్తి ధర రూ.79. ఇందులో సబ్సిడీ రూ.39.50 ఉండగా.. రైతులు రూ.39.50 చెల్లించాల్సి ఉంది. పిల్లి పెసర కిలో విత్తనాల పూర్తి ధర రూ.97. రూ.48.50 సబ్సిడీ ఉంటుంది. రైతులు కిలోకు రూ.48.50 చెల్లించాల్సి ఉంటుంది.
- ఖరీఫ్ సీజన్ పత్తి సాగుకు 12,58,250 బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.
- ఆర్‌బీకేల ద్వారా మిర్చి విత్తనాల పంపిణీకి జిల్లాకు 1296.50 కిలోల విత్తనాలు కేటాయించాలని ఉద్యాన శాఖ ప్రభుత్వాన్ని కోరింది.
- కాగా జిల్లాకు కందులు 1080, మినుము 25, పెసర 5, కొర్ర 15, దయంచ 750, పిల్లి పెసర 190 క్వింటాళ్ల ప్రకారం విత్తనాలు కేటాయించింది. ఏపీ సీడ్ ఈ విత్తనాలను సిద్ధం చేస్తోంది.

వ్యాధిగ్రస్తులకు జీవిత కాలం భరోసా!

- దీర్ఘకాలిక రోగులకు నెలనెలా పెన్షన్లు
- వ్యాధి తీవ్రతను బట్టి నెలకు రూ.3 వేల నుంచి రూ.10 వేలు సాయం
- జిల్లాలో 1158 మందికి ప్రతి నెలా రూ.58.74 లక్షలు


నంద్యాల మండలం చాబోలు గ్రామంలో కడియం లింగమ్మ (పక్షవాతం)కు పింఛన్ పంపిణీ చేస్తున్న గ్రామ వలంటీర్ (ఫైల్)

జిల్లాలో వైఎస్సార్ హెల్త్ పింఛన్ లబ్ధిదారుల వివరాలు...

వ్యాధి	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం (రూ.లక్షల్లో)
సికెల్ సెల్ ఎనిమియా	12	1,20,000
తలసీమియా	61	6,10,000
డయాలసిస్	15	75,000
కుష్టువ్యాధి గ్రస్తులు	213	6,39,000
పక్షవాతం	567	28,35,000
ప్రమాద బాధితులు	209	10,45,000
సివియర్ హోమోఫీలియా	29	2,90,000
బోదకాలు	24	1,20,000
కిడ్నీ, లివర్, గుండె మార్పిడి	27	1,35,000
కిడ్నీ వ్యాధిగ్రస్తులు	1	5,000
మొత్తం	1158	58,74,000

నంద్యాల(రూరల్): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఉచితంగా వైద్య సేవలు అందిస్తూనే రూ.3 వేల నుంచి గరిష్ఠంగా రూ.10 వేల వరకు నెలనెలా పెన్షన్ అందిస్తోంది. 2020లో ప్రారంభమైన వైఎస్సార్ హెల్త్ పెన్షన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారు నంద్యాల జిల్లాలో 1,158 మంది ఉన్నారు. వీరిలో పక్షవాతంతో కదలలేని స్థితిలో ఉన్నవారే అధికం.

పింఛన్ మంజూరు ఇలా....

కుష్టు వ్యాధి గ్రస్తులకు నెలకు రూ.3 వేలు పింఛన్ ఇస్తుండగా కిడ్నీ, లివర్, గుండె రీప్లేస్‌మెంట్ జరిగిన రోగులకు, కిడ్నీ బాధితులకు (సీరం క్రియాటిన్ 5 కంటే ఎక్కువ) ఉన్న వారికి, తీవ్రంగా కండరాల క్షీణతతో పాటు ప్రమాదాలతో మంచానికి, వీల్ చైర్‌కు పరిమితమైన వారికి, పక్షపాతం, బోదకాలు (రెండు కాళ్లకు) ఉన్న వారికి నెలకు రూ.5 వేలు చొప్పున పింఛన్ మంజూరు చేస్తున్నారు. తలసీమియా మేజర్, సికిల్ సెల్, సివియర్ హిమోఫీలియా (2 శాతం పైబడి) ఉన్న రోగులకు నెలకు రూ.10 వేలు అందజేస్తున్నారు. కాగా పక్షపాతం, కండరాల క్షీణత, ప్రమాదాలతో మంచానికి పరిమితమైన రోగులకు సదరం సర్టిఫికెట్ ఆధారంగా పెన్షన్ మంజూరు చేస్తారు.

దరఖాస్తు ఇలా...

దరఖాస్తు దారులకు ముందుగా మెడికల్ బోర్డులోని కమిటీ రోగ నిర్ధారణ చేస్తుంది. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని డాక్టర్లు సోషల్ ఆడిట్ చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు. దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని రోగులకు అందజేస్తారు. దీనికి ఆధార్, బియ్యం కార్డు, బ్యాంక్ ఖాతా పాస్‌పుస్తకం జిరాక్స్‌లను అందజేసి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని వైఎస్సార్ హెల్త్ పెన్షన్ విభాగంలో దరఖాస్తు అందజేయాలి. ఆ విభాగం అధికారులు పరిశీలించి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు అప్‌లోడ్ చేస్తారు. అక్కడి నుంచి పింఛన్ మంజూరు పత్రాలు సచివాలయాలకు చేరుతాయి. దాని ప్రకారం వలంటీర్లు ప్రతి నెల బాధితుల ఇంటికి వెళ్లి పెన్షన్ అందజేస్తారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మా పాపకు పుట్టినప్పటి నుంచి పక్షవాతంతో మంచానికే పరిమితమైంది. ఇప్పుడు పాపకు 12 ఏళ్లు. గత ప్రభుత్వం పింఛన్ రూపంలో రూ.200 నుంచి రూ.500 వరకు మాత్రమే ఇచ్చేది. అది కూడా గ్రామ పంచాయతీకి వెళ్లి తెచ్చుకునేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మాకు నెలకు రూ.5000 చొప్పున పింఛన్ అందజేస్తున్నారు. ప్రతి నెల 1 వ తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి అందజేస్తున్నారు. జగనన్న చేస్తున్న సాయానికి రుణపడి ఉంటాం. – రమాదేవి జిల్లెల్ల గ్రామం, గోస్పాడు మండలం

ఆర్థిక ఆసరా

దీర్ఘకాలిక అనారోగ్యం, ప్రమాదాలతో నడవలేని పరిస్థితిలో ఉండి సాధారణ జీవనం గడపలేని వారికి ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ పెన్షన్ ద్వారా ఆర్థిక ఆసరా కల్పిస్తోంది. ఈ పథకాన్ని అర్హులైన రోగుల దరికి చేర్చేందుకు కృషి చేస్తున్నాం. రోగాన్ని బట్టి నెలకు రూ. 3 వేల నుంచి రూ. 10 వేల వరకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తోంది. జిల్లాలో 1,158 మంది వైఎస్సార్ హెల్త్ పెన్షన్ పొందుతున్నారు.

– శ్రీధర్‌రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ, నంద్యాల